# జూదం

వై. మణీంద్రనాథ్

"బయలుదేరదామా, సార్?" లోపలికి వస్తూ అడిగాడు శంకరం

"ఇంకా టైముందిగా!" వాచీ చూస్తూ అన్నాను.

అతను అడగ్గానే బయల్దేరి నాలో జూదం పట్ల ఆసక్తిని అతనికి తెలియజేయటం మేనేజర్‌గా నా కిష్టం లేదు.

మేనేజర్‌గా సాధ్యమయినంతవరకూ స్టాఫ్ దగ్గర లౌక్యాన్ని ఉపయోగిస్తూ ఉంటాను.

ఒకరి దగ్గర మరొకరిని పొగడడం, విమర్శించడం, అవసరమైనప్పుడు బలహీనతల్ని ఎక్స్‌ప్లాయిట్ చేయడం. వాళ్ళకు అర్థం కాకుండా..అన్నీ వారిలో నా కొక ప్రత్యేక దృష్టిని, గౌరవాన్ని సంపాదించి పెట్టాయి.

"కూల్స్." నాకు తెలుసు—నేను చెప్పేటంత వరకూ కూంప్డని. "అవునూ— రేస్ ఉన్న ప్రతిరోజూ వెళతావు కదూ— లస లేమయినా వస్తుందా, పోవడమేనా?" సంతకం పెడుతున్న కాగితాల్ని పక్కన పెడుతూ అడిగాను.

"ఇది గాంబ్లింగ్, సార్! ప్రతిసారి వస్తే బాంక్‌కి ఎప్పుడో రిజైన్‌చేసేసే వాణ్ణి. కానీ మరీ పోగొట్టుకోను. కారణం ఎప్పుడూ ఎక్కువగా రిస్క్ తీసుకోను. అందుకని ఎక్కువ రావడానికి అవకాశం కూడా ఉండదు. ఇది కూడా వ్యాపారం లాంటిది. పెట్టుబడిని బట్టే ఆధారపడి ఉంటుంది."

"పెద్ద పెద్ద వాళ్ళే పూర్తిగా నష్టపోయారు ఈ జూదంలో. మరి నువ్వేమో దీనిని వ్యాపారంతో పోలుస్తున్నావు." కొద్దిగా వ్యంగ్యంగా అన్నాను— అతన్ని ఎంకరేజ్ చేయడం ఇష్టం లేక.

"ఏమీ తెలియకుండా, జాగ్రత్త లేకుండా వ్యాపారం చేసినా నష్టం వస్తుంది."

అతని దృఢ నిశ్చయం చూస్తుంటే ఆశ్చర్యమేసింది.

"ఏదో వస్తుందని నువ్వు బహుశా ఆ అభిప్రాయాన్ని ఏర్పరచుకొని ఉంటావు. కాని, ఆశలు రేకెత్తించే జూదానికీ, మనిషిలోని చపలత్వానికీ ఎప్పుడూ సంధి కుదరదు. మోస పోతావు జాగ్రత్త — నువ్వు ఎంతకాలం నుంచి వెళుతున్నావేంటి?"

"రెండు సంవత్సరాల నుంచి."

"ఎంత సంపాదించావు?"

"రెండు వేల వరకూ!"

"రేసుల్లో డబ్బు సంపాదించిన— నేను చూసిన మొదటి వ్యక్తివి నీవేనోయ్" నవ్వుతూ, అన్నాను.

"కష్టపడి సంపాదించి, అక్కడ మూర్ఖంగా పారేసుకునేంత వెధవని కాను."

"ఎవరూ మూర్ఖంగా పారేసుకోరు డబ్బుని."

"పారేసుకుంటారని అనను కానీ, ఆశ ఎక్కువగా ఉంటుంది వీళ్ళల్లో— తెగ సంపాదించేద్దామని. ఆడ్స్ ఎక్కువని ఏదో గుర్రంమీద ఆడేస్తుంటారు. బక్కీలూ ఎలాగూ రాదనే ఉద్దేశం అడిగినంత రాస్తుంటారు." అని క్షణం ఆగి అన్నాడు:—

"నిర్లక్ష్యంగా జూదం ఆడకూడదు, సార్! జూదం ఆడడం తప్పు అంటారు పెద్దలు. అందులోనూ కష్టపడి సంపాదించి, నిర్లక్ష్యంగా డబ్బు పోగొట్టుకోవడం మరీ మూర్ఖత్వం."

"మరి తప్పు అని తెలిసి కూడా ఎందుకు వెళుతున్నావు?"

"అది అందరూ అనేది. నాకు మటుకు దానిలో తెలుసుకోవల్సింది. ఎంతో ఉందని అనిపిస్తుంది. గెలిచే గుర్రాన్ని పట్టాలంటే దానికి చాలా కథ ఉంది. అసలు ఆ కళే వేరు, సార్! మనిషిలో విసుగు, ఆనందం, బాధ, నిరాశ, ఆశ — అన్ని అనుభూతులూ నిమిష నిమిషానికి మారిపోతుంటాయి."

"ఏమో! నీ ఆలోచనే, దృక్పథం లోనే ఏదో విశేషం కనిపిస్తుంది. ఎక్కువగా నష్టపోకు. నా సంహా మేనేజర్‌గా కాదు— రామారావుగా."

"ఇప్పటివరకూ జాగ్రత్తగానే ఉన్నాను. ఆ అవసరం వస్తే తప్పక మీరు ... మీ మాటను మర్చిపోను. మీ మాట మీద నాకు గౌరవం, సార్!"

గర్వం కలిగినా నిగ్రహించుకుంటూ "మరి ఆలస్యమవుతున్నట్టుంది.బయలుదేరదామా" అన్నాను. నాకు తెలుసు ఎవరిని, ఎంత దూరంలో ఉంచాలో...

సమాధానం చెప్పకుండా శంకరం లేచాడు.

"నాకు సలహా నువ్వే ఇవ్వాలి. నాకిదే మొదటిసారి— చివరిసారి కూడా" అన్నాను, కుర్చీలోంచి లేస్తూ...

"ఒకసారే వచ్చేటట్టయితే చూడడానికే రండి. ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టట్కండి, సార్! ఎందుకంటే జూదంలో మొదటిసారి తప్పక డబ్బు వస్తుంది. అదే మన బలహీనతకు కొక్కెం వేస్తుంది. అదే దానిలో ఆకర్షణ."

"నీ తోనే వస్తున్నాను కదా! నువ్వే ఈ విషయంలో నాకు మేనేజర్‌వి. నువ్వు నన్ను అలా కన్విన్సు చేశావు."

"థాంక్స్, సర్!"

చాకులాంటి కుర్రాడనిపించింది. ఈ విషయం అనే కాదు. బాంకు పనిలో కూడా అతనిలో ప్రత్యేకత కనిపిస్తుంది. అనవసరంగా వాదించడు. వర్కు తెలుసు. క్రమశిక్షణ తెలుసు. బాంకింగ్‌కి సంబంధించిన విషయాలలో అతని వాదనలో పాయింట్స్‌కి ఒక్కోసారి ఇంత అనుభవం ఉన్న నేనే ఆశ్చర్యపోతూ ఉంటాను. కస్టమర్స్‌ని కన్విన్సు చేయడం, మనుష్యుల్ని గౌరవించే విధానం నాకు పూర్తిగా సంతృప్తి కలిగించింది. అందులో ముఖ్యంగా యూనియన్— పని గంటలు అని వాదించకుండా, అవసరమైనప్పుడు అవుట్ ఆఫ్ టైమింగ్స్ కూడా పని చేస్తూ ఉంటాడు. కాబట్టే శనివారం పన్నెండున్నర వరకూ బాంకు పని చేయవలసి ఉన్నా, అరగంట తొందరగా అడిగివెళ్ళిపోతూ ఉంటాడు— రేసులుంటే... నేను అభ్యంతరం చెప్పను. ఎందుకంటే. అప్పుడు ఎవ్వరికీ పని ఉండదు— ఉండాలనే కంపల్షన్ తప్ప.

• • •

"చాలా ఈజీగా గెలిచిందోయ్!" అన్నాను ఉత్సాహంగా.

"అవు న్సార్! నా సోర్సెస్ అన్నీ యునానిమస్‌గా నిర్ణయించాయి. అందులోనూ ఆ జాకీ చెప్పాడు. పూర్తిగా ప్రయత్నిస్తానని. వాడు నా ఫ్రెండ్. మీకు వంద రూపాయలు లాభం టాక్స్ పోనూ..."

"మరి నువ్వెంత ఆడావు?"

"సలబై!"

నాకు ఆశ్చర్య మేసింది. "అంత డెఫినెట్‌గా తెలిసినా తక్కువ ఆడావే?"

"వచ్చింది కాబట్టే అలా అంటున్నారు. రాకపోతే?... ఇప్పుడు రాసమ్మను. కానీ, అలా ఆడే మొత్తాన్ని పెంచుకుంటూపోతే నికరంగా మిగిలేది నష్టం మాత్రమే!"

"కాని నాకు మాత్రం ఇందాక ఆ వందతో పాటూ ఇంకో రెండొందలు ఆడి ఉంటే బావుండేదని పిస్తోంది."

అతను కూడా ఉత్సాహంగా ఉన్నాడు.

"అది సహజం. పోన్లెండి. ఇంకో గుర్రాన్ని ఇలాగే చెప్పగలననుకుంటా ఈరోజు. అది ఆడదురు కానీ..."

డబ్బు తీసుకోవడానికి క్యూలో నిలుచున్నాం.

"మీరేమీ తొందరపడద్దు, సార్! అవకాశం కోసం చూస్తూ ఓపికని చంపేస్తుంది ఆశ. జాగ్రత్తగా పరిశీలించండి. పెద్ద కష్టం కాదు. నాకు 'ఎసీడే' మీద ఉంది. అయినా, కన్‌ఫర్మ్ చేసుకు రావాలి."

"వెళ్ళు — అన్ని సోర్సెస్ ఉపయోగించుకొని రా. ఈసారి అయిదు వందలు ఆడేస్తాను."

డబ్బు తీసుకున్నాము.

"మీరొక పని చేయడం మంచిది, సార్! నేను మెంబర్స్ గాలరీలోకి వెళ్తాను. జాగ్రత్తగా గమనించండి. కొంతమంది గుర్రాల ఓనర్స్— ట్రైనర్స్ ఆడతారు. అది తెలుసుకుంటే మనకి చాలు."

"వాళ్ళెవరూ నాకు తెలియదే—"

"వాళ్ళు తెలిసేదేమిటి— బాడ్జ్ వేసుకుంటారు. వాడి వెనుకే పదిమంది పంటర్స్ కుక్కల్లా వాచ్ చేస్తుంటారు."

"నన్ను కూడా కుక్కలా తయారవ్వమంటావు."

"సారీ, సర్! అయినా నిజం చెప్పాలంటే దానిలో తప్పేమీ లేదు లెండి. గుర్రాల మీద డబ్బు పెట్టేవాడు— మనిషని ఫాలో చేస్తే తప్పేముంది. ఆడిన దానికి అయిదింతలు ఇస్తానంటే గాడిద కాళ్ళయినా పట్టుకుంటాను. విలువలేని వ్యక్తిత్వం గురించి ఆలోచిం

వడం అనవసరం. మనం అనుకుంటాము కానీ, నిజానికి వ్యక్తిత్వంఎవరికీఉండదు, సార్! తనకు చేతకాకపోతే చట్టం, సమాజం... ఆ పరిధి దాటితే... మీరు ఎక్కడ తిరిగినా ఈ స్పాట్‌కి రండి. పదిహేను నిమిషాల్లో వస్తాను.''

శంకరం పరిగెత్తుతున్నంత వేగంగా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

''కానీ, ఈ రేస్‌లో 'జాన్‌దేవ్' మటుకూ కాలుక్యులేషన్‌లో అవుట్ స్టాండింగ్‌గా ఉంది.''

ప్రక్కకి తిరిగి చూశాను. కొద్దిగా వయసు మళ్ళిన అతను. జుత్తు—ఈ గుర్రాల ఆలోచనతో పండిపోయినట్టుగా తెల్లబడింది.

''కాలుక్యులేషన్ ప్రకారం గుర్రాలు వస్తే — ఇక్కడ ఉండే వాళ్ళని జూద గాళ్ళు అనరు— ఇంటలెక్చువల్స్ అంటారు.'' కుర్రవాడిలా ఉన్నాడు. అతని కెదురుగా విధేయుడిలా నిలబడినా, కుర్ర తనం కనిపిస్తూంది అతని కళ్ళలో.

''ఈ రేసులో 'జాన్‌దేవ్' కొట్టకపోతే — ఇక రేసులకి రావడం మానేస్తాను.'' దృఢ నిశ్చయం కనిపించింది అతని కంఠంలో.

పరిస్థితులను గమనించడంలోపడ్డాను.

బెట్టింగ్స్ మొదలయ్యాయి.

శంకరం వచ్చి అన్నాడు: 'ఎనీ డే' ఆడేయచ్చు, సార్!''

''ఎంత ఆడమంటావు?''

''మీ ఇష్టం, సార్!''

''అయిదు వందలు ఆడేస్తాను.''

శంకరం ఏమీ మాట్లాడలేదు.

''ఏం...నమ్మకం లేదా?'' అనుమానంగా అడిగాను.

''అలా అని కాదు.''

''ఏం ఫరవాలేదు లేవోయ్.''

అయిదు వందలు ప్లస్ టాక్స్ డబ్బై అయిదు — 'ఎనీ డే' మీద ఆడేశాను.

రేస్ మొదలయ్యింది,

ఉన్న ఆరు గుర్రాలలో మొదట మూడు — నాలుగు, అయిదు అడుగుల దూరంలో మిగిలిన మూడు.

నేను ఆడిన 'ఎనీడే' మొదటి మూడులో ఉందనే ధైర్యం కలుగుతున్నా, గెలుస్తుందా అనే అనుమానంతో భయం హృదయపు స్పందనని పెంచుతోంది.

మొదటి మూడులో 'ఎనీడే' ముందుకు వస్తుంది.

రెండొందల దూరంలో విన్నింగ్ పోస్ట్.

'ఎనీడే' — మూడడుగుల దూరంలో ఏ గుర్రంలేకుండా దూసుకుపోతూంది— ముచ్చటగా ఉంది చూడడానికి.

శంకరం భుజం మీద చరిచాను— ఉత్సాహంగా, ఆవేశంగా ...

''కమాన్ 'ఎనీడే' ...''

ఇంతలో ''జాన్‌దేవ్ మూవింగ్ ఫాస్ట్'' అనౌన్స్‌మెంటు —

ఆ రెండింటి మధ్య దూరం క్షణాలలో తగ్గిపోతూంది.

ఉత్సాహం కాస్త భయంగా మారింది.

రెండూ సమానంగా గెలిచేయా అన్నంతగా చివరికి వచ్చేశాయి.

— ఫోటో ఫినిష్ —

గెలిచిన గుర్రాన్ని నిర్ణయించడానికి ఫోటో.

రెండు నిమిషాల్లో—తీసిన ఫోటో ద్వారా గెలిచిన గుర్రాన్ని అనౌన్సు చేస్తారు.

''ఎనీడే' గెలుస్తుం దంటావా?''

''చెప్పలేను, సార్!''

శంకరానికి కూడా అంత నమ్మకం లేదు.

''ఎనీడే' గెలవడానికి అవకాశ ముంది.'' పక్కన ఎవరో అనుకుంటున్నారు.

ఆశ—

కాదని ఏదో వాదన —

నిరాశ—

రెండు నిమిషాల తర్వాత రిజల్ట్స్ ఎనౌన్స్ చేయబడ్డాయి.

'జాన్‌దేవ్' గెలిచింది.

''చ'' అన్నాను చిరాగ్గా, బాధగా. దృఢనిశ్చయంతో కనపడ్డ ఆ ముసలాయన జ్ఞాపకం వచ్చాడు.

''నీ మూలంగా 'ఎనీడే' ఆడాను కానీ, లేకపోతే 'జాన్‌దేవ్' ఆడి ఉండేవాడ్ని.''

''సారీ, సార్...''తల వంచుకున్నాడు.

''నిజంగా అయిదువందలు నష్టం''

''అంత ఆడకుండా ఉండవలసింది.''

''ఇప్పుడా చెప్పటం!''

''తప్పకుండా వస్తుందనుకున్నాను, సార్!''

ఇక నేనే తమాయించు కోవల్సి వచ్చింది.


''ఫరవాలేదులే. .పోయిన దాని గురించి ఆలోచించడం దేనికి?''

''వస్తాను, సార్! ఈ సారి మటుకూ తప్పక చెబుతాను.''

ఆ ముసలాయన ఆడినట్లున్నాడు— క్యూ లో నించొని డబ్బు తీసుకుంటున్నాడు.'నేను చెప్పలేదా' అన్నట్టు గర్వంగా చూస్తున్నాడు ఆ కుర్రాడి వైపు.

నేనూ అదే ఆడి ఉంటే బాగుండును.

ఇందాక వచ్చిన వందా ఇప్పుడు టాక్స్‌కే





MCA/SDP/102/TEL

పోయింది. అయిదు వందలు నష్టం నికరంగా ఆలోచిస్తే. ప్చ్. ఈ సారి ఆ ముసలాయన చెప్పిందే ఆడాలి. స్వగతంలో తృప్తి కలగటం లేదు.

ఆ ముసలాయన, కుర్రోడు మళ్ళీ గుర్రాలుపరించి మాట్లాడుకుంటున్నారు. "నాకు మటుకూ 'డోంట్ వర్రీ' నమ్మత్తం దనిపిస్తోంది. దాని మీద ఆడతాను నేను మటుకూ" అంటున్నాడు ఆ ముసలాయన.

వెరీ గుడ్... తెలిసిపోయింది.

ఇంతలో ఒక ఒనర్ రావడం, గుంపు అతనిని అనుసరించడం గమనించాను.

అతనేం ఆడతాడో చూడాలి. అతన్ని అనుసరిస్తూ—చూపుకు అతడు అందు బాటులో ఉండేటట్టు పరుగు లాటి నడకతో గుంపులోకి చొచ్చుకు పోయి చూశాను. అతడికి క్లియర్‌గా కనపడు తున్న నిర్లక్ష్యం చూస్తుంటే ఆ గుంపు మీద, నా మీద అసహ్యం కలుగుతూంది నాకే.

అతనూ ఆడింది 'డోంట్ వర్రీ'యే.

నేను దాని మీదే ఆడడానికి నిర్ణ యించుకున్నాను.

ఇంకా రేటు పెరుగు తుందేమోనని ఆలోచిస్తూ నిలబడ్డాను.

"నమస్తే, సార్!"

పక్కకు తిరిగి చూశాను...

సన్నగా, పొడుగ్గా నీరసంతో వంగి నట్టుగా కనిపిస్తున్నాడు. ముఖం చాలా వికారంగా ఉంది.

గుర్తు పట్టలేదు. ఆశ్చర్యంగా, అను మానంగా చూశాను అతని వైపు.

"బాబు చిన్న సైకిల్ గెట్లగుంది, సార్!"

చాలా తెలివిగా పరిచయం చేసు కున్నాడు.

అయిదేళ్ళ క్రితం బాబు సైకిల్ బాగు చేసేవాడు.

"ఆరె నువ్వా? చాలా మారిపోయావు. ఏమిటీ...ఇంత సన్నగా, నీరసంగా!" జాలి చూపించాను.

"ఏం చెప్పేది, సార్! నీ యవ్వ తబియత్ మంచిగా లేకుండి, సార్! బతకడమే ముష్కిల్ అయిపోనాది."

"ఇక్కడ పని చేస్తున్నావా?"

"లేదు, సార్! దోస్త్ వద్దన్నా గుంజ కొచ్చిండు."

తిరిగి అతనే అన్నాడు—"ఏ గుర్రం పసందుగా ఉంది, సార్!"

ఇంకా ఏమీ ఆలోచించ లేదు. చూస్తున్నాను.

వెంటనే నా ప్రమేయం లేకుండా నా చేతిని పట్టుకుని బరబరా లాక్కు పోయాడు.

"రాత్రి నమర్ చెప్పిండు—ఈ లోబ గెట్టనయి. 'డోంట్ వర్రీ'విన్ చేస్తదని. ఆ దినం కూడా గిట్లగానే చెప్పిండు' పైస లేక ఆడలే. 'టిప్పూ ది గ్రేట్' రాలే—ఆ వాడు."

"నేను మొదటిసారి రావడం." క్షణం ఆగని కేసి చూస్తూ—"రప్పుడ వస్తం దంటారా? అందులోనూ ఇది కప్ రేస్. అందరూ ట్రై చేస్తారేమో కదా!"

"గట్ల మాట్లాడొద్దు, సార్! నేను పుట్టినకాన్నుంచీ గుర్రాల మధ్య పెరిగినా! గదిగినా రాకపోతే లే నీ యవ్వ ఈడె సస్త!" అతని కంఠంలో దృఢ విశ్వా యానికి ఆశ్చర్యపోయాను.

"ఏం, సార్! ఎస్తదో, రాదా అనా! గదిగినా రాకపోతే ఈ చెప్పిచ్చుకుకొట్టు.' అంటూ నొంగుని చూపుడు వ్రేలుత నా చెప్పు చూపించాడు.

పోనీ ఇంతగా చెబుతుంటే మనస్సులో ఆలోచనకి బలం చేకూరింది.

సరేలే...ఆడతాను...ఒక నిర్ణయానికి వచ్చాను.

వెళ్ళి రేట్లు చూశాను—ఫోర్ టైమ్స్ ఇస్తున్నాడు. వంద ఆడితే నాలుగు వందలు. ఇంకా నష్టం ఉంటుంది. రెండొందలు ఆడితే మొత్తం మీద లాభం మూడొందలు..ప్చ్. అయిదొందలు ఆడేస్తే—మొత్తం మీద పదిహేను వందలు లాభం వస్తుంది. ఇంక వెళ్ళి పోవచ్చు. ఇంతమంది చెబుతుంటే—స్ట్రాంగ్‌గా వీళ్ళందరూ ఎందుకు అలా చెబుతారు. అయిదు వందలు ఆడేశాను.

"ఇప్పుడే వస్తా, సార్! ఇక్కడికే వస్తాను, సార్!" అనిచెప్పి వెళ్ళిపోయాడు.

శంకరం చెప్పిన స్పాట్‌కి వచ్చాను. అతనికి చెప్పాలనుంది.

పక్కింటి రెడ్డిగారు కనిపించారు.

"ఈ రేస్‌లో మీ అభిప్రాయం ఏమిటి?" అడిగాను.

"నా కైతే 'డివైన్ జ్యూయల్' మీద ఉంది."

" 'డోంట్ వర్రీ' ఎలా ఉంది?"

"దానికే ఎక్కువ చాన్సున్నట్టుంది."

మనసు కొద్దిగా సంతృప్తి పడింది.

అయినా, పోతుందన్న ఆలోచనతో లెక్కలు వేస్తున్నాను. వస్తుందన్న ఆశను బలవంతంగా నొక్కి పెట్టి.

శంకరం కనబడలేదు. రేసు స్టార్ట్ అవబోతూంది.

ఆనగరంలో చేతకానితనం మనిషిలో ఆస్తికత్వాన్ని పెంచుతుంది.

గాలిలో దీపం పెట్టాను.

వస్తుందేమో—వూహాలో జరుగుతుం దేమోనన్న ఆశతో సుఖ పడటం నా

చిన్నప్పటి నుండి పెరుగుతున్న బలహీనత.

"అండ్ దె ఆర్ ఆఫ్..."

బెల్ మోగింది.

గుర్రాలు ట్రాక్ నుండి బయట పడ్డాయి.

'డోంట్ వర్రీ' నాలుగో ప్లేస్‌లో ఉంది.

మొదటి రెండు గుర్రాలకీ, మిగతా గుర్రాలకీ మధ్య దూరం పెరిగిపోతోంది.

నాలోని ఆశను—నిరాశ, నిర్లిప్తత నెమ్మదిగా డామినేట్ చేస్తున్నాయి.

ఇంకో రెండొందలు గజాలు.

'డోంట్ వర్రీ' స్థానం నాలుగు నుండి ఆరు లోకి మారింది.

మొదటి రెండు గుర్రాలు ఫినిషింగ్‌లో పంటర్స్‌కి మంచి ఎక్సైట్‌మెంట్‌ని ఇచ్చాయి.

చివరికి 'డివైన్ జ్యూయల్' గెలిచింది.

స్తబ్దత.

కలిగే అనుభూతి చికాకో, అసహ్యమో తెలియడం లేదు.

మొత్తం వెయ్యికి పైగా లాస్ గంటన్నరలో! అవసరంగా వచ్చాను. ఎన్నో వస్తువులు కొందామని పోస్ట్‌పోన్ చేస్తూ వచ్చి...అంతా ఇందులో.

"ఏమైనా ఆడారా?"

పక్కకి తిరిగి చూశాను.

శంకరం.

"డోంట్ వర్రీ' మీద ఆడాను."

"ఎంత ఆడారు?"

"అయిదు వందలు."

"అయ్యో! అంత ఆడకుండా ఉండాల్సింది."

"అదే మన దౌర్బల్యం."

చెప్పేను జరిగింది...ఆ మువలోడు, ట్రైనరు, సైకిల్ బాగు చేసేవాళ్ళ ఇన్‌ఫ్లుయన్స్.

చిన్నగా నవ్వాడు శంకరం. "వాళ్ళంతే. జాకీతో కలిసి 'రాత్రంతా తాగేం, రోజంతా తిరిగాం' అని చెబుతూ ఏదో గుర్రం మీద ఆడిస్తారు. వస్తే కమిషన్ తీసుకుంటారు. లేకపోతే తిరిగి కనపడరు."

రేస్ అవగానే వస్తానన్నవాడు తిరిగి రాలేదు.


బాధ రెండింతలైంది.

ఇంక ఆలోచించడం అనవసరం.

"పోదామా?" అన్నాను శంకరంతో.

ఆశ్చర్యంగా చూశాడు.

అర్థం చేసుకున్నట్టుగా—"పోదాం. కానీ, నాకు తెలిసిన జాకీ ఒకడు ఈ రేస్‌లో ఉన్నాడు. వాడు వెళ్ళేటప్పుడు చెబుతానన్నాడు. బహుశా అది డెఫినెట్‌గా రావచ్చు. నేను వచ్చేంతవరకూ ఇక్కడే ఉండండి" అంటూ వెళ్ళిపోయాడు.




నేను కాఫీ తాగి, శంకరం చెప్పిన స్థలానికే వచ్చి వెయిట్ చేస్తున్నాను. అరగంట గడిచింది. అతను రాలేదు. రాడేమో అనుకున్నాను.

ఇంతలో పరుగెత్తుకుంటూ వచ్చాడు—రొప్పుకుంటూ.

"సార్! మీ రేమీ అనుకోకపోతే నా దొక రిక్వెస్టు."

"ఏమిటది?"

"రేపు పొద్దున బాంక్‌కు వెళ్ళగానే ఇచ్చేస్తాను. మీ దగ్గర ఎంత ఉంది?"

"వెయ్యి రూపాయలు–చిల్లర"

"నా కో అయిదొందలు, మీ కో అయిదొందలు— 'డోంట్ ఎక్స్‌పెక్ట్ మీ' మీద ఆడేయండి. డెఫినెట్...రాకపోతే వాడే ఇస్తానన్నాడు ఆ జాకీ. ప్లీజ్ ఇంకా రెండు నిమిషాలు టైముంది, సార్! ప్లీజ..."

"చూస్తూ చూస్తూ ఆ పేరు గుర్రం మీద ఏం ఆడనోయ్? నా కింకా ఆడటం ఇష్టం లేదు."

"సార్! టైం వేస్ట్ చేయద్దు. అసలు మీకు అందుతుందో, లేదో ...ఆడి, ఇక్కడికే వచ్చేయండి." నన్ను ముందుకు తోస్తూ అన్నాడు.

"నా దగ్గర డబ్బు పూర్తిగా అయిపోయింది. రేపు తప్పక ఇవ్వాలి. విభాగం అయిదొందల డెబ్బై రూపాయలు." కన్ఫర్మేషన్ కొరకు అన్నాను.

అతను అలా తొయ్యడం ఏదోలా అనిపించినా, మేనేజర్‌గా ఈ పరిస్థితులలో అంతగా పట్టించుకోనట్టు ముందుకు నడిచాను.

"తప్పక, సార్! రేస్ అవగానే ఇక్కడికే రండి" అంటూ పరుగెత్తుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆడదామని వెళ్ళాను.

వెయ్యికి వెయ్యి.

వెయ్యి బుక్కీస్‌కి ఇచ్చి "వన్ తౌజండ్ 'డోంట్ ఎక్స్‌పెక్ట్ మి'" అన్నాను.

అతను తీసుకున్నాడో, లేదో రేసు స్టార్ట్ అయిపోయింది.

అతను కార్డు మీద రాసిచ్చాడు. మొత్తం రెండు వేలు, ఆడిన వెయ్యితో కలిపి.

ఇది పోతే అంతా కలిపి పదహారు వందల వరకూ నష్టం —టాక్స్‌తో కలిపి...

ఒక వేళ వస్తే ఆరొందలు చిల్లర లాస్...

చూడాలి— అనవసరంగా ఆలోచించడం వేస్ట్.

'డోంట్ ఎక్స్‌పెక్ట్ మి' చాలా ఈజీగా గెలిచింది.

ఎందుకో భరించలేనంత ఆనందం.

సడన్‌గా ఎక్కడో అంతర్గతంగా ఉన్న బలహీనతకి నెమ్మదిగా బలం పెరుగుతూ వచ్చింది.

శంకరానికి పెద్ద నష్టం లేదు.

ఈ మొత్తం నేనే తీసుకుంటే— ఈ రోజు లాసేం ఉండదు. ఇంక ఎప్పుడూ రాకుండా ఉంటే సరి. అందులో ఇందాక ఒక్క నిముషం ఆలస్యం చేసి ఉంటే ఆ గుర్రంమీద ఆడగలిగి ఉండేవాడిని కాదు. అందునా నేను లేకపోతే డబ్బు లేకపోవడంవలన అతనూ ఆడి ఉండేవాడు కాదు.

వంచన అనుకున్నాను గానీ, అదే సంతృప్తి కలిగించింది.

ఆడబోయే సరికి రేస్ స్టార్ట్ అయిపోయిందనీ, అందుకనే ఆడలేదనీ శంకరానికి చెప్దామని నిర్ణయానికి వచ్చాను.

డబ్బు తీసుకోవడానికి ఇంకా పది నిముషాలు పడుతుంది.

శంకరం చెప్పిన స్థలానికి వచ్చాను.

అతను నా కోసం ఆత్రతగా ఎదురు చూస్తున్నట్లుగా కన్పించాడు.

"ఆడారా, సార్!"

"ప్చ్...లేదయ్యా! వెళ్ళేసరికి టైం అయిపోయింది." సాధ్యమైనంతవరకూ నిర్లిప్తతను వ్యక్తం చేశాను.

"అనుకున్నాను, సార్— నే నొచ్చే సరికే లేటయిపోయింది. వెధవ... ఆలస్యంగా చెప్పాడు. నాది కూడా మూడొందలు పోయింది. రికవర్ చేస్తానను కున్నాను. ఈ రోజు దురదృష్టానికే ఎక్కువ బలమున్నట్లుంది. పోన్లెండి. ఇంకొకటి ఏమైనా తెలుస్తుందేమో కనుక్కొని వస్తాను" అంటూ వెళ్ళిపోయాడు.

భారంగా వూపిరి పీల్చాను.

ఇంతకుముందు అంత సంపాదించిన వాడికి ఇది నష్టం కాదు.

డబ్బులు తీసుకునే క్యూ లో నిలుచున్నాను.

బాగా బుద్ధి వచ్చింది. ఈ రోజు లాసేం లేదు. వెరీ గుడ్, ఇంకెప్పుడూ రాకూడదు.

కార్డు తీసుకొని, రెండువేలు లెక్కపెట్టి, అన్నీ వందలు ఇచ్చాడు ఆ బుక్కీ...

అతను ఇస్తున్న వందలు ఇరవై అందుకుంటుంటే భుజం మీద చెయ్యి పడింది.

పక్కకి తిరిగి చూశాను.

శంకరం —

నాలో వూపిరి ఆగిపోయి, ప్రాణం పోయినట్లనిపించింది.

ఏడవలేక నవ్వుతూ లెక్కపెట్టి అతని వాటా నాలుగు వందల పాతిక అతనికి ఇచ్చేశాను.

నా భుజమ్మీద చెయ్యి వేసిన శంకరం చనువు గుచ్చుకుంటూంది బాధగా, ఆటోలో తిరిగి వస్తూంటే.

ఎవర్ని ఎంత దూరంలో ఉంచాలో లౌక్యంతో ప్రవర్తించే మేనేజర్— భుజమ్మీద చెయ్యేసే చనువు శంకరానికి రావడానికి కారణం జూదం కదూ! ★